Nityam Nigha 12.09.26_Layout 1 9/12/2026 7:08 AM Page 1

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

www.nityamnigha.com

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY


మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా



వరంగల్ | సంపుటి 2 | సంచిక 71 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శనివారం 12.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం : ప్రధాని మోదీ

- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత ముఖ్యం
- సముద్ర వాణిజ్యానికి పెరుగుతున్న అంతరాయాలపై ప్రధాని మోదీ ఆందోళన
- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పెరిగిందన్న ప్రధాని
- బ్రిక్స్ దేశాల మధ్య పెట్టుబడులు, భాగస్వామ్యం పెరగాలని పిలుపు



»2

ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు

- హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు



»2

- వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు
- సెప్టెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు ఆంక్షలు అమలు
- ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు మళ్లింపులు
- భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాల ఏర్పాటు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని నగర పోలీసుల సూచన



సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి : రాంచందర్‌రావు

- 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోదీ

»2

- సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్న రాంచందర్ రావు
- సెప్టెంబర్ 7న దీపాలు వెలిగించి మోదీకి శుభాకాంక్షలు తెలపాలని పిలుపు

శాసనసభ సజావుగా జరగకుండా ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర

- రేవంత్ రెడ్డి

- శాసనసభ సజావుగా జరగకుండా కేసీఆర్ ఫాంహౌస్‌లోనే కుట్రలు జరిగాయన్న రేవంత్ రెడ్డి
- ప్రజాప్రతినిధులను, పోలీసులను దూషిస్తూ మూడు రోజులు సభను అడ్డుకున్నారని మండిపాటు
- బీఆర్ఎస్ కుట్రలను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమర్థవంతంగా తిప్పికొట్టారని ప్రశంస



నిత్యం నిఘా, హైదరాబాద్ : శాసనసభను సజావుగా సాగనివ్వకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఆయన ఫాంహౌస్‌లోనే కుట్రలు పన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అధికారం పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నాయకులు పోలీసు అధికారులను, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజుల పాటు సభాకార్యక్రమాలను అడ్డుకున్నారని మండిపడ్డారు. ఈరోజు నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంలో ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సభలో అధికారులపై అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, సభాపతిని అత్యంత తీవ్ర పదజాలంతో దూషించారని, మహిళా అధికారుల ముందే టీషర్టులు విప్పి అభ్యంతరకరంగా నిరసన తెలపడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల దిగజారుడుతనానికి నిదర్శనమని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన దళితులు నడిచిన నేలను బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేసి దళితులను ఘోరంగా అవమానించారని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుండి జరిగిన ఈ అవాంఛనీయ ఘటనలన్నింటిపై ప్రభుత్వం తరఫున సమగ్ర విచారణకు ఆదేశించామని వెల్లడించారు. బీఆర్ఎస్ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాజకీయంగా ఎదిగిన సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి లాంటి నాయకులు ఇప్పుడు అదే పార్టీకి నష్టం చేయాలని చూడటం దారుణమని సీఎం అన్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోయి ఉంటే వారు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కూడా కేటీఆర్‌కు తన రూపమే కనిపిస్తున్నట్టుందని, అందుకే అధికారులపై అంత ఆక్రోశంతో దాడులకు తెగబడుతున్నారని ఎద్దేవా చేశారు. శాసనసభ చర్చల్లో క్రమం తప్పకుండా పాల్గొనాలని, హాజరు శాతాన్ని కాపాడుకుంటూ స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ..

- నలుగురు నిందితుల అరెస్ట్



ఆగస్ట్ 31న బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో ఆయుధాల చోరీ

ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ ల సహకారం

28, 29 తేదీల్లో రెక్కీ నిర్వహించిన మల్లేశ్

నిత్యం నిఘా, హైదరాబాద్ :
హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు.
ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ ..

»2

22ఏ అనేది పొరపాటు కాదు..

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గం: హరీశ్ రావు

- రేవంత్ రెడ్డి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారన్న హరీశ్
- మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్
- సామాన్యుల ఆస్తులను 22ఏ నుంచి తొలగించాలన్న హరీశ్

»2



మంత్రి పదవి నుంచి కొండా సురేఖ తొలగింపుపై కేటీఆర్ సంచలన ఆరోపణలు



- కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంపై కేటీఆర్ స్పందన
- సీఎం సోదరుల భూ కుంభకోణాన్ని బయటపెట్టినందుకే సురేఖపై వేటు వేశారని ఆరోపణ
- కాంగ్రెస్ హయాంలో దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా జరుగుతోందని విమర్శ
- నిషేధిత భూముల జాబితా 16 లక్షల నుంచి కోటి 16 లక్షల ఎకరాలకు పెరిగిందని వెల్లడి

నిత్యం నిఘా, హైదరాబాద్ : రాష్ట్ర మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడం వెనుక భారీ భూ కుంభకోణం దాగి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులకు సంబంధించిన భూ అక్రమాలను కొండా సురేఖ కుమార్తె వెలుగులోకి తీసుకువచ్చినందుకే ఆమెపై వేటు పడిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా పర్వం కొనసాగుతోందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

»2

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..

అనలాగ్ పన్నీర్‌పై నిషేధం

- ప్రజారోగ్యం దృష్ట్యా సర్కార్ కీలక నిర్ణయం
- తయారీ, అమ్మకాలపై ఏడాది పాటు నిషేధం విధింపు
- సెప్టెంబర్ 10 నుంచి అమల్లోకి వచ్చిన ఉత్తర్వులు

»2



కొండా సురేఖకు బుజ్జగింపులు...


కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్



»2

మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ..

తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు



»2

Nityam Nigha 12.09.26_Layout 1 9/12/2026 7:08 AM Page 2

బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ..

- నలుగురు నిందితుల అరెస్ట్

మొదటిపేజీ తరువాయి.. అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు. ఈ చోరీకి ఎలాంటి అంతరాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉన్న ఈ ప్రమాదకర ఆయుధాల చోరీని సత్వరమే ఛేదించిన మిలిటరీ అధికారులను, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను, దర్యాప్తు బృందాలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..

అనలాగ్ పన్నీర్‌పై నిషేధం

మొదటిపేజీ తరువాయి.. ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 'అనలాగ్' (కృత్రిమ) పన్నీర్‌పై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిషేధం ఏడాది పాటు అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. పన్నీర్ పేరిట విక్రయిస్తున్న నాణ్యత లేని, కల్తీ ఉత్పత్తుల వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతున్న నేపథ్యంలో ఈ కఠిన చర్యలు చేపట్టింది. పన్నీర్ పేరుతో చలామణి అవుతున్న డైరీయేతర, కృత్రిమ ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ, రవాణా, పంపిణీ మరియు విక్రయాలపై ఈ నిషేధం వర్తిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ఆహార భద్రతా విభాగం (టీజీ సేఫ్) ఉత్తర్వులు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 10వ తేదీ నుంచి ఈ ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే అమల్లోకి వచ్చాయి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ 30(2)(a) ప్రకారం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వులతో రాష్ట్రంలో కల్తీ పన్నీర్ తయారీ, విక్రయాలకు అడ్డుకట్ట పడనుంది.

22ఏ అనేది పారపాటు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గం

- హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో నిషేధిత భూముల జాబితా 22ఏ వివాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో భూములను చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశంతో చేసిన పెద్ద దుర్మార్గమని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో 22ఏ బాధితులతో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి' పడుతోందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై కన్నేశారని హరీశ్ రావు ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారానికి ఫోన్ చేస్తే చాలని ప్రచారం చేసుకున్నారని, కానీ నేరుగా వెళ్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసినా బాధితులకు ఎలాంటి పరిష్కారం దొరకడం లేదని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న ప్రభుత్వం... బడా బాబులు నిర్మించిన అక్రమ నివాసాల జోలికి మాత్రం వెళ్లడం లేదని విమర్శించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. 2ఏ నిషేధిత జాబితా నుంచి ముఖ్యమంత్రి నివాసాన్ని తొలగించినప్పుడు, అదే జాబితాలో ఉన్న సామాన్య ప్రజల నివాసాలను, భూములను ఎందుకు తొలగించడం లేదని నిలదీశారు. తక్షణమే పేదల, సామాన్యుల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని హరీశ్ రావు స్పష్టం చేశారు.

మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ.. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు

మొదటిపేజీ తరువాయి.. తెతెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించి పర్యావరణ నిబంధనలు, అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే అధ్యయనం చేశారని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో మృగవాణి జాతీయ పార్కు కూడా ఉందని తెలిపారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా అభ్యంతరాలు లేవనెత్తారు. ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు వాదించారు. పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన వివరాలను ట్రిబ్యునల్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం తన వాదనను కూడా వెల్లడించాల్సి ఉంది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. ఇప్పుడు మరో పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం : ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో సముద్ర వాణిజ్యానికి, సరఫరా వ్యవస్థలకు (సప్లై చైన్స్) ఎదురవుతున్న అంతరాయాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షితమైన, పటిష్ఠమైన సరఫరా గొలుసులకు, నౌకాయాన స్వేచ్ఛకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం దినదినాభివృద్ధి చెందుతోందని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు కలిగి ఉన్నాయని వివరించారు. ప్రపంచ జీడీపీ సుమారు 2.5 రెట్లు వృద్ధి చెందగా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ ఏకంగా 4.5 రెట్లు పెరిగిందని, ఇది ప్రపంచ సగటు వృద్ధి కన్నా దాదాపు రెట్టింపు అని వెల్లడించారు. బ్రిక్స్ దేశాలు సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారుతున్నాయని ప్రధాని ప్రశంసించారు. ఈ ఆర్థిక శక్తిని ప్రపంచానికి మేలు చేకూర్చే ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బ్రిక్స్ సభ్య దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లలో ఇదే అతిపెద్దదని, దీనికి భారత్ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.

సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి : రాంచందర్‌రావు

మొదటిపేజీ తరువాయి.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా మరింత చేరువ కావడం, అలాగే పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. అభియాన్ ఆరంభ రోజైన సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' పేరిట రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి ప్రధాన మంత్రికి శుభాకాంక్షలు తెలియజేయాలని రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను నేరుగా బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ఫలాలను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విప్లవంతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఆర్థిక చేయూతనిస్తున్నామని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే 'మేరే సప్నో కా భారత్', 'సేవా కీ కహానీ', 'సేవా జ్యోతి కలశ్ యాత్ర', 'సుశాసన్ సేవా సంవాద్' వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, మోదీ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేస్తామని పేర్కొన్నారు.

ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు

- హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహా గణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పాటు రోజూ ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు.

ప్రధాన మళ్లింపులు ఇవే:

పోలీసులు ప్రకటన ప్రకారం, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బడా గణేష్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్ మీదుగా మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

భక్తులకు పార్కింగ్ సౌకర్యాలు:

గణపతి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి వచ్చే భక్తుల కోసం విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనదారులు రద్దీగా ఉండే మార్గాలకు బదులుగా ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

మంత్రి పదవి నుంచి కొండా సురేఖ తొలగింపుపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి..

శుక్రవారం తెలంగాణ భవన్‌లో '22ఏ' నిషేధిత భూముల బాధితులతో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. మంచి ర్యాలలో మొదలైన ఈ భూ కుంభకోణం వ్యవహారం ముదరడంతో, దానిని కప్పిపుచ్చేందుకు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 16 లక్షల ఎకరాలుగా ఉన్న 22ఏ నిషేధిత భూముల జాబితా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా కోటి 16 లక్షల ఎకరాలకు పెరిగిందని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న భూదందాకు ఇదే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ఒక మంత్రి కుమార్తె ప్రభుత్వంలోని అవినీతిని ప్రశ్నిస్తే, ఏకంగా ఆ మంత్రినే పదవి నుంచి తొలగించడం దారుణమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ ఉదంతం కాంగ్రెస్ పాలనలో పారదర్శకత ఎంతలా లోపించిందో తేటతెల్లం చేస్తోందని ఆయన విమర్శించారు.

కొండా సురేఖకు బుజ్జగింపులు... కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్

మొదటిపేజీ తరువాయి..

తెలంగాణ మాజీ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో, సురేఖతో ఆమె నేరుగా సంభాషించినట్లు తెలియడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర రాజకీయాలు, పార్టీలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. వ్యక్తిగత అంశాలు, అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో తిరిగి చురుగ్గా పాల్గొనాల



ని ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్.. కొండా సురేఖకు సూచించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి తప్పించిన తర్వాత జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు సురేఖ గైర్హాజరు కావడం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో, పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే ఇన్‌ఛార్జ్ నేరుగా సురేఖతో మాట్లాడినట్లు సమాచారం. ఈ ఫోన్ కాల్ అనంతరం సురేఖ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా లేదా అన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

Nityam Nigha 12.09.26_Layout 1 9/12/2026 7:08 AM Page 3

సంపాదకీయం

కరువు కోరల్లో తెలంగాణ..!

- రైతు కన్నీటికి ప్రభుత్వం స్పందిస్తుందా?
- ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతు.. ఎండిపోతున్న పంటలు..
- నిండని చెరువులుఅడుగంటుతున్న భూగర్భ జలాలు..
- కరువు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నా ప్రభుత్వ మౌనం ఎందుకు?



నిత్యం నిఘా ✍ :..

ఒకవైపు మండుతున్న ఎండలు.. మరోవైపు మొహం చాటేస్తున్న వర్షాలు.. దీంతో తెలంగాణలో కరువు ఛాయలు క్రమంగా ముదురుతున్నాయి. పొలాల్లో పంటలు ఎండిపోతుండగా.. చెరువుల్లో నీటి జాడ కనిపించని పరిస్థితి నెలకొంది. భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో పల్లె ప్రజలు సాగునీటితో పాటు తాగునీటి కోసం కూడా ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. "వర్షం ఎప్పుడు వస్తుంది? పంటను కాపాడేంత వాన కురుస్తుందా?" అనే ప్రశ్నలు రైతులను వెంటాడుతున్నాయి. చెమటోడ్చి సాగు చేసిన రైతన్నకు ఇప్పుడు ఆకాశమే దిక్కుగా మారింది.

ఖరీఫ్ సాగుపై వర్షాభావం దెబ్బ

సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ సాగుపైనా తీవ్ర ప్రభావం పడుతోంది. భూమిలో తేమ లేక కొందరు రైతులు విత్తనాలు వేయలేకపోగా.. మరికొందరు విత్తనాలు వేసినా తర్వాతి వర్షాలు లేక పంటలను కాపాడుకోవడం కష్టంగా మారింది. పత్తి, వరి, వేరుశెనగ, పప్పుధాన్యాలు తదితర పంటలు వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. పంటలకు అవసరమైన సమయంలో నీరు అందకపోతే దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి రైతుదే.. నష్టం కూడా రైతుదేనా?

విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం ఇప్పటికే అప్పులు చేసి సాగు చేపట్టిన రైతులకు వర్షాభావం మరో పెద్ద దెబ్బగా మారింది. పంట చేతికొచ్చి అప్పులు తీర్చుకోవచ్చని ఆశించిన రైతులకు ఇప్పుడు పంటను ఎలా కాపాడుకోవాలన్నదే ప్రశ్నగా మారింది. పంట చేతికిరాకపోతే చేసిన అప్పులు ఎలా తీర్చాలి? కుటుంబాన్ని ఎలా పోషించాలి? అనే ఆందోళన రైతుల్లో నెలకొంది.

పంట నష్టం అంచనా ఎప్పుడు?

వర్షాభావంతో పంటలు నష్టపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేయాల్సిన అవసరం ఉంది. నష్టపోయిన పంటలకు పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం ఎప్పుడు అందుతుందన్న దానిపై రైతులకు స్పష్టత కావాలి. కరువు పరిస్థితులను ముందుగానే గుర్తించి.. పంట నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి.. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని రైతు సంఘాలు, సాగుదారులు కోరుతున్నారు.

"రైతును ఆదుకోకపోతే పరిస్థితి మరింత విషమం"

కరువు పరిస్థితులపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని నిత్యం నిఘా సీఈవో నాగేష్ గౌడ్ డిమాండ్ చేశారు. వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తక్షణమే పంట నష్టం అంచనా వేసి ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలని, రైతులు చెల్లించిన పంటల బీమాకు సంబంధించిన పరిహారాన్ని వెంటనే అందించాలని కోరారు. కరువు ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "రైతు కష్టాల్లో ఉంటే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎలా బలపడుతుంది? పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం ఇంకా ఎంతకాలం మౌనంగా ఉంటుంది?" అని నాగేష్ గౌడ్ ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అత్యవసర సమీక్ష నిర్వహించి కరువు పరిస్థితులను అంచనా వేయాలని, రైతులకు పంట నష్టం పరిహారం, పంటల బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు తాగునీరు, సాగునీటి సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతు బతికితేనే వ్యవసాయం బతుకుతుంది..
వ్యవసాయం బతికితేనే రాష్ట్రం బతుకుతుంది!

గుత్తికోయల భూములపై అటవీ అధికారుల పంజా?

- 15 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిలో ఇంకుడు గుంతల తవ్వకాలు
- "మా భూమి మాకే దక్కేలా చూడాలి".. మంత్రి సీతక్కకు గిరిజన కుటుంబాల వేడుకోలు

తాడ్వాయి, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గుత్తికోయ గిరిజన కుటుంబాల భూములపై అటవీ శాఖ అధికారులు చర్యలకు దిగుతున్నారనే ఆరోపణలు తాడ్వాయి మండలం భూపతిపురం గ్రామంలో కలకలం రేపుతున్నాయి. సుమారు 15 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూముల్లో అటవీ అధికారులు ఇంకుడు గుంతలు తవ్వేందుకు ప్రయత్నిస్తున్నారని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. భూపతిపురం గ్రామానికి చెందిన బంగారు లక్ష్మి కుటుంబం సుమారు రెండు ఎకరాలు, మడకం కుటుంబం సుమారు ఒక ఎకరం భూమిని గత 15 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. తమ భూములకు గతంలో సర్వే కూడా నిర్వహించారని వారు పేర్కొన్నారు. గత ప్రభుత్వం హయాంలో పోడు భూముల పట్టాల కోసం సర్వే నిర్వహించడంతో తమకు కూడా పట్టాలు వస్తాయని ఆశించామని, అయితే ప్రభుత్వం మారడంతో పట్టాల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయిందని బాధితులు చెబుతున్నారు.

"ప్రశ్నిస్తే కేసులు పెడతామంటున్నారు"

తమ భూములపై ప్రస్తుతం అటవీ శాఖ అధికారులు దృష్టి సారించారని బాధితులు ఆరోపిస్తున్నారు. గిరిజన కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేస్తూ తమ భూముల్లో ఇంకుడు గుంతలు తవ్వేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమపైనే కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. 15 ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూమి ఇప్పుడు మాత్రమే అధికారులకు ఎందుకు గుర్తుకొచ్చిందని బాధిత కుటుంబాలు ప్రశ్నిస్తున్నాయి. తాము స్వయంగా చదును చేసుకుని పంటలు పండిస్తున్న భూమిలో ఇంకుడు గుంతలు ఎందుకు తవ్వుతున్నారని నిలదీస్తున్నారు.

భూమే జీవనాధారం.. దిక్కుతోచని స్థితిలో కుటుంబాలు

బాధిత కుటుంబాలు అత్యంత నిరుపేదలని, తమ జీవనాధారం పూర్తిగా ఆ భూమిపైనే ఆధారపడి ఉందని చెబుతున్నారు. సాగు భూమి తమకు దూరమైతే కుటుంబాల పరిస్థితి ఏమవుతుందని కన్నీరుమున్నీరవుతున్నారు.

"15 సంవత్సరాలుగా మేము ఈ భూమిని సాగు చేసుకుంటున్నాం. అప్పటి నుంచి అధికారులు ఎక్కడ ఉన్నారు? ఇప్పుడు ఒక్కసారిగా వచ్చి మా భూమిలో పనులు చేయడం ఎంతవరకు న్యాయం?" అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి సీతక్క స్పందించాలని వేడుకోలు

తమ నియోజకవర్గానికి చెందిన గిరిజన కుటుంబాలకు మంత్రి సీతక్క అండగా నిలుస్తారనే నమ్మకంతోనే ఆమెకు ఓటు వేశామని బాధితులు తెలిపారు. తన



నియోజకవర్గంలో గిరిజనుల భూముల విషయంలో ఇలాంటి పరిస్థితి నెలకొనడం బాధాకరమని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో పోడు భూముల పట్టాల కోసం తమ భూములను కూడా సర్వే చేశారని, ప్రభుత్వం మారడంతో ఆ ప్రక్రియ మరుగున పడిందని పేర్కొన్నారు. ప్రస్తుతం అటవీ అధికారులు తమ భూముల విషయంలో అత్యుత్సాహం చూపుతున్నారని ఆరోపించారు. తమ భూములను కాపాడి, అటవీ శాఖ అధికారుల చర్యలకు అడ్డుకట్ట వేసి, తమకు న్యాయం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను బాధిత గిరిజన కుటుంబాలు వేడుకుంటున్నాయి. తమ సమస్య పరిష్కారం కాకపోతే తీవ్రంగా నష్టపోతామని, ప్రాణాలు తీసుకునే పరిస్థితికి వెళ్లాల్సి వస్తుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఆరోపణలపై సంబంధిత అటవీ శాఖ అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితిని వెల్లడించాల్సిన అవసరం ఉంది.

గుంతలపై ట్రాఫిక్ సీఐ వెంకన్న కొరడా

- ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారులకు తక్షణ మరమ్మతులు
- స్వయంగా రంగంలోకి దిగి మూడు భారీ గుంతలను పూడ్చివేసిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

హన్మకొండ/కాజీపేట, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): రహదారి భద్రతపై కేవలం సమీక్షలు, ఆదేశాలకే పరిమితం కాకుండా ప్రయాణికుల రక్షణకు ప్రాధాన్యమిస్తూ కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న చొరవ చూపారు. కాజీపేట పరిధిలోని ఫాతిమా బ్రిడ్జి, అదాలత్ సెంటర్ ప్రధాన రహదారులపై ప్రమాదకరంగా మారిన గుంతలను తన ప్రత్యక్ష పర్యవేక్షణలో కాంక్రీట్‌తో పూడ్చివేయించారు.

*** వర్షాలతో మరింత ప్రమాదకరంగా...**

ఇటీవల కురిసిన వర్షాలు, నిరంతర వాహనాల రాకపోకల కారణంగా ఫాతిమా బ్రిడ్జి, అదాలత్ సెంటర్ ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిని భారీ గుంతలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం గత పది రోజుల వ్యవధిలో గుంతల కారణంగా మూడు ప్రమాదాలు చోటుచేసుకోగా, వాహనదారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

*** ఫిర్యాదులపై తక్షణ స్పందన**

స్థానికులు, వాహనదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న వెంటనే స్పందించారు. సంబంధిత విభాగాల అధికారులు వచ్చే వరకు వేచి చూడకుండా సిబ్బందితో కలిసి రహదారి ప్రాంతాలను పరిశీలించారు. అత్యంత ప్రమాదకరంగా ఉన్న మూడు భారీ గుంతలను గుర్తించి, వాటిని సిద్ధంగా ఉన్న కాంక్రీట్ మిశ్రమంతో పూడ్చివేయించి మరమ్మతులు చేయించారు.



*** వాహనదారుల హర్షం**

గుంతలు పూడ్చివేయడంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా భద్రతకు ప్రాధాన్యమిస్తూ తక్షణమే స్పందించిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, సిబ్బందిని పలువురు అభినందించారు. రహదారి సమస్యలను అధికారులు పట్టించుకోకముందే క్షేత్రస్థాయిలో గుర్తించి చర్యలు తీసుకోవడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.

మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలి

- కర్నే రవీందర్ పిలుపు.. విద్యార్థులు, కాలనీ పెద్దలతో అవగాహన కార్యక్రమం

వరంగల్, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి) పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రంగసాయిపేట కాలనీల డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు కర్నే రవీందర్ పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. శంభునిపేట 41వ డివిజన్ పరిధిలోని ఖమ్మం రోడ్డు, నాగమయ్య ఆర్చ్ ఎదురుగా కర్నే రవీందర్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల ప్రతిష్ఠాపనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసే వినాయక విగ్రహాలను చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమవడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతినడం, కాలుష్యం పెరగడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి వినాయకులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. ప్రజలు తమ ఇళ్లలో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెనాల్ట్ ప్రిన్సిపాల్ స్కూల్ విద్యార్థులు, కాలనీ పెద్దలు కర్నే వాసుదేవ్, గడ్డం లింగమూర్తి, సంజు, వేములకోటి తదితరులు పాల్గొన్నారు.



Nityam Nigha 12.09.26_Layout 1 9/12/2026 7:08 AM Page 4

అసత్య ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోం

- రాజకీయాల్లో ఉన్నవారికి వ్యక్తిత్వమే ముఖ్యం
- ప్రజాసేవలో మా కుటుంబానికి సుదీర్ఘ చరిత్ర ఉంది

- బీజేపీ నేత చంద్రుపట్ల సునీల్ రెడ్డి



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): రాజకీయాల్లో ఉన్నవారికి వ్యక్తిత్వం, నైతిక విలువలే ప్రధానమని, స్వార్థ రాజకీయాల కోసం ఇతరులపై అసత్య ప్రచారాలు చేయడం, వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పెద్దపల్లి జిల్లా మాజీ అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి అన్నారు. తమపై అసత్య ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. మంథనిలోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాసేవలో తమ కుటుంబానికి సుదీర్ఘమైన చరిత్ర ఉందన్నారు. సీఎన్ రెడ్డి, నారాయణ రెడ్డి వంటి పెద్దల సిద్ధాంతాలు, విలువలను ఆదర్శంగా తీసుకుని తాము రాజకీయాల్లో కొనసాగుతున్నామని తెలిపారు. గత 15 సంవత్సరాలుగా ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ సేవాభావంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. సమాజ హితం కోసం 10 ఎకరాల భూమిని గ్రామపంచాయతీ ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి, మరో భూమిని దేవాలయ నిర్మాణానికి విరాళంగా అందించినట్లు సునీల్ రెడ్డి పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు ఉద్యోగ మేళాలు నిర్వహించామని, బ్యాంకులు, ఆసుపత్రుల ఏర్పాటుకు సహకరించామని తెలిపారు. గోదావరి వరదలు, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు అండగా నిలిచి సేవా కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. ప్రజల్లో తమ కుటుంబానికి ఉన్న విశ్వాసాన్ని రాజకీయ లబ్ధి కోసం చేసే అసత్య ప్రచారాలతో దెబ్బతీయలేరని అన్నారు. ప్రత్యర్థులపై వ్యక్తిగత దూషణలు, బురదజల్లే రాజకీయాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. రాజకీయాల్లో విమర్శలకు తాము సిద్ధమేనని, అయితే వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా అసత్య ప్రచారాలకు పాల్పడితే మాత్రం తగిన విధంగా స్పందిస్తామని చంద్రుపట్ల సునీల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు సబ్బని సంతోష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సామంతుల అశోక్, భూసారపు తిరుపతి, నియోజకవర్గ సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జ్ ఎడ్ల సాగర్, మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు బొల్లింపల్లి లక్ష్మణ్, అయిటి మల్లేష్, కార్యదర్శి పార్వతి విష్ణు, పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షులు కుడ్ల గురుతేజ్, మండల ఉపాధ్యక్షులు ఎలవేని సమ్మయ్య, నాయకులు సాయి, శ్రీకాంత్, చందు, కొలక నరసయ్య, కెర్రె నాగయ్య, సోమారం సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజించండి.. పర్యావరణాన్ని కాపాడండి

- విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతులు..

- ప్రధానోపాధ్యాయులు వాసం సాంబశివరావు



ఏటూరునాగారం, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులను తయారు చేసి పూజించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏటూరునాగారం ప్రధానోపాధ్యాయులు వాసం సాంబశివరావు సూచించారు. పాఠశాలలో ఎకో క్లబ్, జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి గణపతి విగ్రహాలను తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సాంబశివరావు మాట్లాడుతూ.. మట్టి గణపతులను తయారు చేసి పూజించడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన గణపతి విగ్రహాలు నీటిలో సులభంగా కరగకపోవడంతో నీటి వనరులు కలుషితమవుతాయని తెలిపారు. అలాగే విగ్రహాలకు ఉపయోగించే రసాయన రంగులు నీటిలో కలవడం వల్ల జలచర జీవుల మనుగడకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజలు పర్యావరణహితమైన మట్టి గణపతులను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొడెం సమ్మయ్య, కొర్ర రాజన్న, పల్లె నాగరాజు, మాధురి, రజితతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

నిమజ్జన ప్రాంతాలను ఆకస్మికంగా పరిశీలించిన సీపీ శ్వేత, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రత, ట్రాఫిక్, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



హన్మకొండ, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి):) రాబోయే వినాయక నిమజ్జన ఉత్సవాలను పురస్కరించుకుని హనుమకొండ జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా నగరం, పరిసర ప్రాంతాల్లోని ప్రధాన నిమజ్జన ప్రాంతాలను వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన సీపీ, కలెక్టర్.. వినాయక నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.

*** ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి**

నిమజ్జన ప్రాంతాలు, ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సీపీ శ్వేత పోలీస్ అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో వాహనాల మళ్లింపు చర్యలు చేపట్టి, నిమజ్జన ప్రాంతాల్లో తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

*** పారిశుధ్యం, విద్యుత్ ఏర్పాట్లు**

నిమజ్జన చెరువుల పరిసర ప్రాంతాల్లో నిరంతరం పారిశుధ్య పనులు నిర్వహించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా తగినంత వెలుతురు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.

*** క్రేన్లు, ఈతగాళ్ల బృందాలు సిద్ధం**

పెద్ద విగ్రహాల నిమజ్జనం కోసం అవసరమైన భారీ క్రేన్లను ముందుగానే సిద్ధంగా ఉంచాలని అధికారులు ఆదేశించారు. నిమజ్జన ఘాట్ల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా శిక్షణ పొందిన ఈతగాళ్ల బృందాలను అందుబాటులో ఉంచడంతో పాటు ప్రాణరక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. వినాయక నిమజ్జన వేడుకలను భక్తులంతా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని, పోలీసు, అధికారుల సూచనలను పాటిస్తూ సహకరించాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కోరారు. నిమజ్జన ఉత్సవాల సందర్భంగా ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. ఈ క్షేత్రస్థాయి తనిఖీలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలి

- సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి



ఏటూరునాగారం, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి):): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చిటమట రఘు మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పథకాలపై సరైన అవగాహన లేక అర్హులైన పలువురు లబ్ధి పొందలేక పోతున్నారని, ఈ పరిస్థితిని నివారించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా ప్రభుత్వానికి, అధికారులకు మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేసి వాటిని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని చిటమట రఘు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి (డీఆర్‌డీఏ), తహసీల్దార్, ఏటూరునాగారం డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ కర్ల అరుణ, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాటాపూర్ అంగన్వాడి కేంద్రంలో ఘనంగా పోషణ మాస ఉత్సవం

- మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్వాడీల్లో చేర్పించాలి: సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు

ములుగు జిల్లా/ తాడ్వాయి, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండలం కాటాపూర్ అంగన్వాడి కేంద్రం-3లో పోషణ మాస ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి టీచర్ శ్రీకాళ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పిల్లలకు విద్యతో పాటు పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని తల్లిదండ్రులు తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. పిల్లల విద్యాభ్యాసానికి పునాది అంగన్వాడి కేంద్రాల నుంచే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు పాలు, గుడ్లు, బాలామృతం తదితర పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ హేమలత, సూపర్‌వైజర్ సుమతి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అనిల్ బండారి, అంగన్వాడి టీచర్ సమ్మక్క, వార్డు సభ్యురాలు నగ్మా, చిట్టినేని సరిత, అంగన్వాడి సహాయకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



కూడా చైర్మన్ గుండు సుధారాణికి శుభాకాంక్షలు

- పూలబొకేతో మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కందగట్ల నరహరి



వరంగల్ / సంగెం, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణిని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కందగట్ల నరహరి, సంగెం మండల మాజీ ఎంపీపీ కందగట్ల కళావతి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం గుండు సుధారాణిని కలిసి పూలబొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి, కూడా చైర్మన్‌గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంగెం మండల కాంగ్రెస్ నాయకులు జగన్నాధాచారి, ముసుకుంట్ల మోహన్, నూర వీరాస్వామి, నల్లతీగల రవి తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 12.09.26_Layout 1 9/12/2026 7:08 AM Page 5

పెండింగ్ కేసుల్లో జాప్యం చేస్తే కఠిన చర్యలు

- జీరో ఎఫ్ఐఆర్‌ను తక్షణమే నమోదు చేయాలి

- సైబర్, ఆస్తి నేరాలపై కఠిన చర్యలు



ములుగు జిల్లా , సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): పెండింగ్ కేసుల దర్యాప్తులో జాప్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ హెచ్చరించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఆధ్వర్యంలో ఆగస్టు నెల నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలను సమీక్షించిన ఎస్పీ.. కేసుల దర్యాప్తు పురోగతిపై అధికారులను ఆరా తీశారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసి, అక్కడ తక్షణమే ఎఫ్ఐఆర్ పునఃనమోదు చేసి దర్యాప్తు ప్రారంభించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసు సేవలు మరింత వేగంగా అందేలా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ఆస్తి నేరాలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు పురోగతిని నిరంతరం సమీక్షించడంతో పాటు, కేసుల వివరాలను నేర పరిశోధన, నేర నమోదు మరియు నేర గణాంకాల వ్యవస్థలో ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. రానున్న గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు, స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టి, ప్రజల సహకారంతో వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు.నిబద్ధతతో విధులు నిర్వహించిన అధికారులకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం అదనపు ఎస్పీ మనన్ భట్, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, ములుగు సీఐ దారం సురేష్, పసర సీఐ దయాకర్, ఏటూరునాగారం సీఐ సూర్యప్రకాష్, ప్రత్యేక శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, ఆర్ఐ అడ్మిన్ రాధారత్ స్వామి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆపరేషన్స్ తిరుపతి, ఆర్ఐ ఎంటీఓ వెంకటనారాయణ, స్టేషన్ హౌస్ అధికారులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

ధర్మవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏడీఈ

- రాత్రివేళల్లోనూ అదనపు విద్యుత్ ఇవ్వాలని రైతుల విజ్ఞప్తి



ములుగు జిల్లా/ వాజేడు, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): మండల పరిధిలోని ధర్మవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను విద్యుత్ శాఖ ఏడీఈ బి. ఉమారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా పరిస్థితిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, పంటలకు సాగునీరు అందించడంలో ఎదురవుతున్న ఇబ్బందులపై స్థానిక మిరప రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితుల్లో మిరప తోటలను కాపాడుకునేందుకు అందుతున్న వ్యవసాయ విద్యుత్ సరఫరా సరిపోవడం లేదని రైతులు ఏడీఈ దృష్టికి తీసుకెళ్లారు. ఉదయం వేళల్లో అందిస్తున్న విద్యుత్‌కు అదనంగా రాత్రివేళల్లోనూ వ్యవసాయ విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 4 గంటల వరకు ఆరు గంటలపాటు మూడు దశల విద్యుత్ సరఫరా అందించాలని కోరుతూ రైతు ప్రతినిధులు ఏడీఈకి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అదనపు విద్యుత్ అందితేనే మిరప తోటలను ఎండిపోకుండా కాపాడుకునే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏడీఈ బి. ఉమారావు మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, పంటల ప్రస్తుత పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా అదనపు విద్యుత్ సరఫరాకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది, పలువురు మిరప తోటల రైతులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

- మ్యాపింగ్ కాని, అనామాలీస్ ఓటర్ల నోటీసులు పెండింగ్‌లో ఉండొద్దు



హనుమకొండ, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామాలీస్ జాబితాలోని ఓటర్లకు నోటీసుల జారీ, విచారణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు.శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవితో కలిసి కలెక్టర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో మ్యాపింగ్ కాని, అనామాలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల జారీ, విచారణ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో మ్యాపింగ్ కాని, అనామాలీస్ జాబితాలోని ఓటర్లకు జారీ చేయాల్సిన నోటీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదన్నారు. సంబంధిత ఓటర్ల విచారణ ప్రక్రియ ప్రతిరోజూ పురోగతిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విచారణ ప్రక్రియను సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని తెలిపారు. ఓటర్ల నుంచి అందే ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఈ నెల 12, 13 తేదీల్లో ప్రత్యేక ప్రచార శిబిరాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు కోరుకునే వారు లేదా ఏవైనా అభ్యంతరాలు ఉన్నవారు సంబంధిత దరఖాస్తులు సమర్పించుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. ప్రత్యేక శిబిరాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు సహాయపడేందుకు బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రత్యేక ప్రచార శిబిరాల సందర్భంగా సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు తప్పని సరిగా పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎన్.ఆర్. వెంకటేష్, డీఎస్. వెంకన్న, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్‌సింగ్, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఉన్న తహసీల్దార్లు, ఎంపీడీవోలు, నాయబ్ తహసీల్దార్లు, జీడబ్ల్యూఎంసీ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీది వికసిత్ భారత్ కాదు.. వివక్ష భారత్



హనుమకొండ, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): బీజేపీది వికసిత్ భారత్ కాదని.. వివక్ష భారత్ అని టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ కోటూరి మానవతారాయ్ విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ కూడా బీజేపీని అనుసరిస్తూ దళితుల పట్ల వివక్ష చూపుతోందని ఆరోపించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మానవతారాయ్ మాట్లాడారు. ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను బీజేపీ నేతలు శుద్ధి చేయడం దళిత నాయకుడికి జరిగిన ఘోర అవమానమని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న దళిత స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దూషించడం క్షమించరాని విషయమని ఆరోపించారు. దళిత స్పీకర్‌ను అవమానించిన ఘటనకు నిరసనగా కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో దళితులు కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దప్పులు కొట్టి నిరసన తెలిపారని పేర్కొన్నారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ప్రాంతంలో దళితులు నడిచిన నేలను బీఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీటితో శుద్ధి చేశారన్న ఆరోపణలు అనాగరిక చర్యలకు నిదర్శనమన్నారు. కేసీఆర్ హయాంలో దళితులకు అన్యాయం జరిగిందని మానవతారాయ్ ఆరోపించారు. దళిత ముఖ్యమంత్రి హామీతో దళితులను మోసం చేశారని, మూడు ఎకరాల భూమి హామీని నెరవేర్చలేదని విమర్శించారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ రాజయ్యను ఉప ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించడం, మాదిగలకు మంత్రివర్గంలో తగిన ప్రాతినిధ్యం కల్పించకపోవడం దళితులకు జరిగిన అన్యాయమని పేర్కొన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చుతానంటూ గతంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు దళితుల పట్ల ఆయన వైఖరిని వెల్లడించాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి హోదాలో అంబేద్కర్, పూలే జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు దూరంగా ఉండటం ద్వారా దళిత, బహుజన వర్గాల పట్ల వ్యతిరేకతను ప్రదర్శించారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హాజరుకాకుండా వ్యవహరించిన తీరుపైనా మానవతారాయ్ తీవ్రంగా స్పందించారు. పాఠశాలకు వెళ్లని విద్యార్థిని బడి దొంగ అంటామని, అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాని వారిని ప్రజలు అసెంబ్లీ దొంగలని పిలుస్తున్నారని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన సందర్భంగా మహిళా అధికారులు, పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టిందని, తమ పార్టీకి ప్రజల్లో ఆదరణ కొనసాగుతోందని మానవతారాయ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజామోదం ఉందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిపై ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,19,931గా ఉందని, దేశంలో రెండో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. త్వరలోనే మొదటి స్థానానికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక, ఆరోగ్య రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ప్రపంచ బ్యాంకు, కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్, భారతీయ రిజర్వు బ్యాంకు వంటి సంస్థల నివేదికలు దీనిని ధ్రువీకరిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, పెరుమాండ్ల రామకృష్ణ, బండెల భద్రయ్య, ఆరూరి సాంబయ్య, వీసం సురేందర్‌రెడ్డి, మహమ్మద్ రహమతుల్లా, హర్షం అశోక్, మేడారపు సుధాకర్ నేత, అచ్చ వర్ష, రోషన్ గైక్వాడ్, కుమ్మరి రవి తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17 పై ప్రభుత్వ మౌనం ఎందుకు?

- అధికారికంగా నిర్వహించేందుకు వెంటనే నిర్ణయం తీసుకోవాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు అడుప రాజు



వరంగల్/ వర్ధన్నపేట, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ చరిత్రలో కీలకమైన సెప్టెంబర్ 17కు అధికారిక గుర్తింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని బీజేపీ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు అడుప రాజు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17ను ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం వర్ధన్నపేట తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అడుప రాజు మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేకమైన చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. ఇలాంటి చారిత్రక ఘట్టాలను రాజకీయ కోణంలో చూడకుండా, భవిష్యత్ తరాలకు తెలంగాణ చరిత్రను తెలియజేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని కోరారు.

*** చరిత్రను మరుగున పడేయొద్దు**

సెప్టెంబర్ 17 ప్రాధాన్యతను ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులు, యువతకు తెలియజేసేలా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించాలని అడుప రాజు డిమాండ్ చేశారు. చారిత్రక నేపథ్యాన్ని యువతకు వివరించేలా అవగాహన కార్యక్రమాలు, అధికారిక వేడుకలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 17 విషయంలో ప్రభుత్వం ఇకనైనా మౌనం వీడి స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని కోరారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా వేడుకలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఈ అంశంపై ప్రజల్లో చర్చ మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని అడుప రాజు పేర్కొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన శ్రావణమాస ఉత్సవాలు

-ప్రత్యేక పూజలు, హోమాలతో శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముగింపు కార్యక్రమాలు



జనగామ జిల్లా/ పాలకుర్తి, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రావణమాస ఉత్సవాలు శుక్రవారం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు నిర్వహించారు. ఈ సందర్భంగా గవ్యాంత పూజలు, శ్రీ సూక్త పూజ, లలితా సహస్రనామ పారాయణం, చండీ హవనం, బిల్వార్చన, కుంకుమార్చన, తులసి అర్చనతో పాటు పరివార దేవతలకు ప్రత్యేక హవనాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ భాగం లక్ష్మీ ప్రసన్న, విశ్వక్ సేన్ చౌదరి దంపతులు, సంతోష్, శ్యామ్, ఆలయ సిబ్బంది అర్చకులు డీవీఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, మత్తగజం, నాగరాజు, సునీల్, సరోజన, రాములు, రమేష్‌తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

Nityam Nigha 12.09.26_Layout 1 9/12/2026 7:08 AM Page 6

ప్రజల భద్రతకు పెద్దపీట

- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం
- నూతన సీఐ సంజీవరావుకు వెంకట్రావుపల్లె కాంగ్రెస్ నేతల ఘన స్వాగతం
- యువతను మాదక ద్రవ్యాల బారి నుంచి కాపాడాలి.. పోలీసింగ్‌ను మరింత పటిష్ఠం చేయాలి



వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేటలో శాంతిభద్రతల పరిరక్షణకు మరింత పటిష్ఠమైన పోలీసింగ్ అవసరమని వెంకట్రావుపల్లె కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. వర్ధన్నపేట పట్టణ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంజీవరావును కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మడత ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు సమస్యలతో వచ్చే ప్రతి ఒక్కరి ఫిర్యాదును సానుకూలంగా స్వీకరించి, చట్టపరమైన పరిధిలో సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉండేలా పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

*** అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు**

గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. గ్రామాల్లో నిఘా వ్యవస్థను పటిష్ఠం చేసి, అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పించాలని కోరారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ నేరాల నియంత్రణ, నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రజల్లో పోలీస్ శాఖపై మరింత నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు.

*** యువతను మాదక ద్రవ్యాల బారి నుంచి కాపాడాలి**

యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మాదక ద్రవ్యాలు, గుట్కా, పొగాకు తదితర హానికర పదార్థాల వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. కేవలం కేసులనమోదుకే పరిమితం కాకుండా యువతలో అవగాహనకల్పించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచడంలో పోలీసులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్ధన్నపేటలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని, నూతన సీఐ సంజీవరావు ఆధ్వర్యంలో పోలీస్ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు భద్రతాభావాన్ని కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మడత ప్రశాంత్ గౌడ్, సంకినేని దేవేందర్‌రావు, మిట్టపల్లి రమేష్, ఎండీ వలీ పాషా, బూడిద శ్రీనివాస్ గౌడ్, వంగపండ్ల బలరాములు తదితరులు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ తుంపుల మోహన్ కుటుంబంలో విషాదం

- తల్లి ఈశ్వరమ్మ మృతి.. కుటుంబాన్ని పరామర్శించిన మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



హన్మకొండ/ఐనవోలు, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): ఐనవోలు మండల మాజీ వైస్ ఎంపీపీ తుంపుల మోహన్ కుటుంబంలో విషాదం నెలకొంది. తుంపుల మోహన్ తల్లి ఈశ్వరమ్మ శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈశ్వరమ్మ మృతి విషయం తెలుసుకున్న మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తుంపుల మోహన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈశ్వరమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సత్తిరెడ్డి, చందర్‌రెడ్డి, బుర్ర రాజశేఖర్, మధు, దేవేందర్, భూపాల్, రాజు తదితరులు పాల్గొని ఈశ్వరమ్మ మృతికి సంతాపం తెలిపారు.

సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- తల్లి.. బిడ్డ ఆరోగ్యమే లక్ష్యంఘనంగా జిల్లా స్థాయి పోషణ్ మేళా

-పోషకాహారంపై అవగాహన కల్పించిన అధికారులు



హన్మకొండ, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): మాతా, శిశు మరణాలను నివారించడంతో పాటు ఆరోగ్య తెలంగాణ సాధనలో భాగంగా ప్రభుత్వం పోషణ మాసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి అన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'పోషణ్ మాసఃా–2026' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హన్మకొండలో జిల్లా స్థాయి 'పోషణ్ మేళా'ను ఘనంగా నిర్వహించారు. పోషకాహార లోపాన్ని నివారించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రవి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శేషాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ.. పోషణ అంటే కేవలం ఆహారం అందించడం మాత్రమే కాదని, ఆరోగ్యవంతమైన భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దడమని అన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. చిన్నారులు, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పోషకాహారాన్ని రోజువారీ జీవనశైలిలో భాగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని క్రమపద్ధతిలో తీసుకోవడం ద్వారా తల్లి, శిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

*** అన్ని శాఖల సమన్వయంతో పోషణ కార్యక్రమాలు**

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. జిల్లాలో పోషణ మాసం కార్యక్రమాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తూ వారి పోషణ స్థాయిని పెంచడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పౌష్టికాహారం అందించడంతో పాటు దాని ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

*** ఘనంగా శ్రీమంతం.. అన్నప్రాశన**

పోషణ్ మేళాలో భాగంగా గర్భిణులకు కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సంప్రదాయబద్ధంగా శ్రీమంతం నిర్వహించి సీమంతపు సారెను అందజేశారు. ఏడు నెలలు నిండిన చిన్నారులకు పౌష్టికాహారంతో అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు.

*** ఆకట్టుకున్న ఆహార ప్రదర్శన**

పోషణ్ మేళాలో ఏర్పాటు చేసిన ఆహార ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ రకాల ఆహార సమూహాలతో పాటు ఆహార పిరమిడ్‌ను ప్రదర్శించి, వాటిలోని పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే 'బాలామృతం'తో తయారు చేసిన వివిధ రకాల రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటకాలను ప్రదర్శించి పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా యువజన క్రీడల అధికారి, ఆయుష్ అధికారులు, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు, పోషణ్ అభియాన్ బృందం సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థుల కానుక

- జడ్పీహెచ్ఎస్ కాటాపూర్‌కు రూ.15 వేల విలువైన తరగతి గది బల్లలు విరాళం

- మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ విద్యార్థులకు అండగా నిలిచిన 1995–96 బ్యాచ్



ములుగు జిల్లా/ తాడ్వాయి , సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండలం కాటాపూర్ లోని తాము చదువుకున్న పాఠశాలపై ఉన్న అభిమానాన్ని పూర్వ విద్యార్థులు మరోసారి చాటుకున్నారు. జడ్పీహెచ్ఎస్ కాటాపూర్‌లో 1995–96 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు విద్యార్థుల అవసరాలను గుర్తించి రూ.15 వేల విలువైన తరగతి గది బల్లలను పాఠశాలకు విరాళంగా అందజేశారు. పూర్వ విద్యార్థులు ఇటీవల తాము విద్యనభ్యసించిన పాఠశాలను సందర్శించి, నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, తాము చదువుకున్న విద్యాసంస్థ అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాణాల సుధాకర్‌ను సంప్రదించి, పాఠశాలకు అవసరమైన సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ఉపయోగం కోసం తరగతి గది బల్లలు అవసరమని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు రూ.15 వేల విలువైన బల్లలను సమకూర్చారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సక్రునాయక్ సమక్షంలో కాటాపూర్ సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు చేతుల మీదుగా పూర్వ విద్యార్థులు బల్లలను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సేవాభావం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మంకిడి నరసింహస్వామి, కూచన రాజు, కందకట్ల సాంబయ్య, పర్వతాల కృష్ణ, ఎం.డి. హస్మత్, పల్నాడు సత్యం, ముకుందం, ఎం.డి. రహమాన్, సూచన రమాదేవి, రియాజ్ తదితరులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం



హనుమకొండ, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి) : అమావాస్య సందర్భంగా శ్రీ మార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలోని మర్కాజి హైస్కూల్ జంక్షన్, రాజా శివాజీ బార్ సెంటర్ సమీపంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పాసికంటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కులబంధువులు, సంఘం నాయకులు పాల్గొని భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారు పాసికంటి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పాసికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కోటభద్రి, సహాయ కార్యదర్శి ఆసందం, ముఖ్య నాయకులు సత్యప్రకాష్, సిరిమల్లె పున్నం చందర్, పద్మబ్రాహ్మణుడు బింగి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి నెల నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ఆర్థికంగా, ఇతరత్రా సహాయ సహకారాలు అందిస్తూ విజయవంతం చేస్తున్న ప్రతి ఒక్కరికీ శ్రీ మార్కండేయ సేవా సంఘం తరఫున అధ్యక్షుడు పాసికంటి రాజేంద్రప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రతి నెల జరిగే సేవా కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొంటూ సహకరిస్తున్న మిరియాల దేవేందర్, రంజిత్, వాటిక సురేష్, వాటిక రాజు తదితరులకు సంఘం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. భవిష్యత్తులో కూడా ప్రతి నెల నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో కులబంధువులు అధిక సంఖ్యలో పాల్గొని తమవంతు ఆర్థిక, సహాయ సహకారాలు అందించాలని శ్రీ మార్కండేయ సేవా సంఘం అధ్యక్షుడు పాసికంటి రాజేంద్రప్రసాద్ కోరారు.

కూడా చైర్మన్ గుండు సుధారాణికి శుభాకాంక్షలు



హన్మకొండ / హసన్ పర్తి, సెప్టెంబర్ 11, (నిత్యం నిఘా ప్రతినిధి) : కుడా చైర్మన్ గుండు సుధారాణిని కాంగ్రెస్ నాయకులు ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై పరస్పరం చర్చించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు, మాజీ మార్కెట్ డైరెక్టర్ వీసం సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రామంచ ఐలయ్య, తాళ్ల మధు, గరిగే రాజు తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 12.09.26_Layout 1 9/12/2026 7:08 AM Page 7

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కాంగ్రెస్‌కు షాక్..
బీఆర్ఎస్‌లోకి 100 మంది



భూపాలపల్లి / మొగుళ్లపల్లి,సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి):

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలిందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఇప్పలపల్లి గ్రామ ఉపసర్పంచ్ కూతురు వినోద్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 100 మంది బీఆర్ఎస్‌లో చేరినట్లు పార్టీ నాయకులు తెలిపారు. బీఆర్ఎస్ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు బల్దూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన చేరికల కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోద్‌తో పాటు ఆయన అనుచరులకు పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

ప్రజా సమస్యలపై కాంగ్రెస్ విఫలం : గండ్ర

ఈ సందర్భంగా గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తూ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. ప్రజల తరపున ప్రశ్నించే గొంతుకలను అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని అన్నారు.

కేసీఆర్ పాలనపై విశ్వాసంతో బీఆర్ఎస్‌లో చేరాం

బీఆర్ఎస్‌లో చేరిన వినోద్ మాట్లాడుతూ.. ప్రజలకు మేలు చేస్తారని భావించి కాంగ్రెస్ పార్టీలో చేరినా, ప్రజలకు ఆశించిన స్థాయిలో సౌకర్యాలు కల్పించలేకపోతున్నామని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. తనతో పాటు గ్రామంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు.

మరింత మంది చేరుతారా?

ఇప్పలపల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఈ చేరికలతో భూపాలపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి అంశంపై రాజకీయ చర్చ మొదలైంది. అధికార పార్టీలో ప్రజాప్రతినిధులకు తగిన ప్రాధాన్యం, గౌరవం లభించడం లేదనే అసంతృప్తి పలువురిలో ఉందని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. రానున్న రోజుల్లో మరికొందరు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం నియోజకవర్గంలో సాగుతోంది. అయితే ఈ వాదనలపై కాంగ్రెస్ పార్టీ నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

మట్టి గణపతినే ప్రతిష్ఠిద్దాం..
పర్యావరణాన్ని కాపాడుదాం

- **నీటి కొరత దృష్ట్యా మట్టి విగ్రహాలకే ప్రాధాన్యం ఇవ్వాలి**
- **గణపతి మండపాల నిర్వాహకులు, భక్తులు సహకరించాలి : మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్**



కరీంనగర్ జిల్లా / జమ్మికుంట, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): రానున్న వినాయక చవితి సందర్భంగా జమ్మికుంట పట్టణ ప్రజలు, గణపతి మండపాల నిర్వాహకులు, భక్తులు మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పిలుపునిచ్చారు. నీటి కొరతతోపాటు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ మట్టి గణపతికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో జమ్మికుంట పట్టణంలోని చెరువుల్లో నీటి లభ్యత తక్కువగా ఉందని చైర్మన్ తెలిపారు. దీంతో వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. నిమజ్జన ఏర్పాట్లపై ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించినప్పటికీ, నీటి కొరత నేపథ్యంలో ఈసారి నిమజ్జన కార్యక్రమం సవాలుగా మారే పరిస్థితి ఉందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించడం ఉత్తమమైన మార్గమని తెలిపారు. మట్టి విగ్రహాలను తక్కువ నీటిలోనే నిమజ్జనం చేయవచ్చని, అవి నీటిలో త్వరగా కరిగిపోవడం వల్ల పర్యావరణానికి హాని తక్కువగా ఉంటుందని వివరించారు. సంప్రదాయాలను కాపాడుతూనే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. జమ్మికుంట పట్టణంలోని గణపతి మండపాల నిర్వాహకులు, యువతీ యువకులు, భక్తులు ఈసారి మట్టి గణపతినే ప్రతిష్ఠించి పూజించాలని, మట్టి గణపతి నిమజ్జన కార్యక్రమానికి సహకరించాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో నిమజ్జన కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు .“మట్టి గణపతి మన సంప్రదాయానికి ప్రతీక.. పర్యావరణ పరిరక్షణకు మార్గం. నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని ఈ వినాయక చవితికి మట్టి గణపతినే ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం” అని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పేర్కొన్నారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సీపీ వార్షిక తనిఖీ

- **రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి**
- **ట్రాఫిక్ నిబంధనల అమలుతో పాటు ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి**





వరంగల్, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి) : వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ శుక్రవారం వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న సీపీకి ఇన్‌స్పెక్టర్ మొక్క అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను కమిషనర్ పరిశీలించారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించిన సీపీ.. సిబ్బంది శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ పోలీసుల విధుల నిర్వహణ, వాహనాల తనిఖీలు, ట్రాఫిక్ నిబంధనల అమలు, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రమాద ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం, వాహనదారులు, పాదచారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీపీ ఎన్. శ్వేత సూచించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలకు నిబంధనలపై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, సమర్థవంతమైన సేవలు అందించాలని తెలిపారు.

విధుల్లో అంకితభావంతో పనిచేయాలి


స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధుల కేటాయింపు తదితర అంశాలను పరిశీలించిన సీపీ.. విధుల్లో మరింత అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీలో ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, ఎస్ఐలు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల్లో జాప్యం చేస్తే కఠిన చర్యలు

- **జీరో ఎఫ్ఐఆర్‌ను తక్షణమే నమోదు చేయాలి**
- **సైబర్, ఆస్తి నేరాలపై ప్రత్యేక దృష్టి.. సీసీటీఎన్ఎస్ వివరాలు ఎప్పటికప్పుడు నవీకరించాలి**
- **గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలి**







ములుగు, సెప్టెంబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి) :
పెండింగ్ కేసుల దర్యాప్తులో జాప్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్, ఐపీఎస్ పోలీసు అధికారులను హెచ్చరించారు. ములుగు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ఆగస్టు నెల నేర సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల పురోగతిని సమీక్షించారు.
పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. కేసుల దర్యాప్తులో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జీరో ఎఫ్ఐఆర్‌పై నిర్లక్ష్యం వద్దు

జీరో ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయడంతో పాటు, అక్కడ తక్షణమే ఎఫ్ఐఆర్ పునఃనమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టేలా అధికారులు పర్యవేక్షించాలని ఎస్పీ స్పష్టం చేశారు. సైబర్ నేరాల కేసుల పురోగతిని సమీక్షించిన ఆయన.. బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆస్తి నేరాలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కేసులకు సంబంధించిన వివరాలను సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు నవీకరించాలని అధికారులకు స్పష్టం చేశారు.

గణేష్ ఉత్సవాలపై ముందస్తు ప్రణాళిక

రానున్న గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ సూచించారు. ఉత్సవ నిర్వాహకులు, స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేయాలని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజల సహకారంతో ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

నిబద్ధతతో పనిచేసిన అధికారులకు ప్రశంస

విధుల్లో నిబద్ధతతో పనిచేసిన అధికారులకు ఎస్పీ ప్రశంస పత్రాలు అందజేశారు.

ఈ సమావేశంలో ఏటూరునాగారం అదనపు ఎస్పీ మనన్ భట్, ఐపీఎస్, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, ములుగు సీఐ దారం సురేష్, పసరా సీఐ దయాకర్, ఏటూరునాగారం సీఐ సూర్య ప్రకాష్, ప్రత్యేక శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, ఆర్ఐ అడ్మిన్ రాధారత్ స్వామి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆపరేషన్స్ తిరుపతి, ఆర్ఐ ఎంటీవో వెంకటనారాయణతో పాటు స్టేషన్ హౌస్ అధికారులు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Nityam Nigha 12.09.26_Layout 1 9/12/2026 7:08 AM Page 8

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి సత్వర పరిష్కారం చూపాలి

- అక్రమ ఇసుక, పశు రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి
- పెట్రోలింగ్, బ్లూ కోట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలి
- అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



ఖమ్మం, సెప్టెంబర్ 11, నిత్యం నిఘా : వార్షిక తనిఖీలలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ఎస్పీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం విధుల్లో ఉన్న సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపే విధంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. వివిధ వర్టికల్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రేవ్, ప్రాపర్టీ, దొంగతనం కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నిందితులను త్వరగా గుర్తించి అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన ఆస్తిని రికవరీ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా అక్రమ పశు రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. కేసుల దర్యాప్తులో భాగంగా గత నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పెట్రోలింగ్ వాహనాలు, బ్లూ కోట్స్ వాహనాల్లో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని తక్షణమే స్పందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించిన అనంతరం పోలీసింగ్ వెబ్ అప్లికేషన్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు సీఐఆర్ పోర్టల్, ఈ సాక్ష, నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా నేరాల దర్యాప్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని తెలిపారు. సైబర్ మోసాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీలక్షి , స్టేషన్ హౌస్ ఆఫీసర్ విజయసింహా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.





ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు సహకరించాలి

-శాంతి కమిటీల సమన్వయ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం, సెప్టెంబర్ 11, నిత్యం నిఘా : వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని శాంతి సామరస్యాన్ని కాపాడుకుంటూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ సూచించారు. సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న గణేశ్ నవరాత్రుల ఉత్సవాల కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పీస్ కమిటీలతో వినాయక నవరాత్రి విగ్రహాల ఏర్పాట్లు, బందోబస్తుపై పోలీసు కమిషనర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో జరుపుకొనే అతి పెద్ద ఉత్సవాల్లో ఒకటైన గణేష్ వేడుకలను ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలన్నారు. అదేవిదంగా సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా ప్రజలకు అవగాహన కల్పించడం. అనుమానాస్పద సమాచారం



లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.గణేష్ నవరాత్రుల ఉత్సవాలు శాంతియుతంగా, సురక్షితంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా భద్రతకు సంబంధించి, పోలీసు, నగరపాలక సంస్థ , అగ్ని మాపక శాఖ, నీటి పారుదల శాఖ, వైద్య శాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి సమన్వయంగా పనిచేస్తూ, శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరుపుకునేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు.గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శాంతి కమిటీ సభ్యులు పోలీసులు సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు.వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సమయంలో నిర్ణయించిన మార్గాలు, సమయాలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మోహన్ బాబు, బాలకృష్ణ భానుప్రకాష్ పాల్గొన్నారు.

నాయుడు పంప్ జంక్షన్ వద్ద డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి

- కూడా చైర్మన్ గుండు సుధారాణికి తెలంగాణ వాకర్స్ అసోసియేషన్ వినతి





నిత్యం నిఘా, వరంగల్, సెప్టెంబర్ 11 : ఖమ్మం హైవేలోని నాయుడు పంప్ జంక్షన్ నుండి తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాల, ఉర్సు రోడ్ వరకు సుమారు ఒక కిలోమీటరు మేర ప్రధాన డ్రైనేజీ నిర్మాణం చేపట్టి, స్థానిక ప్రజల సమస్యను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈరోజు KUDA చైర్మన్ శ్రీమతి గుండు సుధారాణి గారికి ఆమె నివాసంలో వినతిపత్రం సమర్పించారు. వెంకటేశ్వర కాలనీ, సాయి నగర్, పుల్లయ్య కుంట, లెనిన్ నగర్, పెరుకవాడ, సాగర కాలనీ, కురుమవాడ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగునీరు మొత్తం నాయుడు పంప్ జంక్షన్ వైపు ప్రవహించే అవకాశం ఉండటంతో, ఈ ప్రాంతంలో డ్రైనేజీ నీటి ప్రవాహం అధికంగా ఉంటుందని వారు తెలిపారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షాకాలంలో నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్య చాలా కాలంగా కొనసాగుతోందని, దీనిపై గుండు సుధారాణి గారికి ఇప్పటికే పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ఆమె గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఉన్న సమయంలో తెలంగాణ కాలనీ డ్రైనేజీ సమస్యను స్వయంగా సందర్శించి పరిశీలించిన విషయాన్ని గుర్తు చేశారు. అందువల్ల ఈ సమస్యను అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణించి, నాయుడు పంప్ జంక్షన్ నుండి తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాల, ఉర్సు రోడ్ వరకు అవసరమైన ప్రధాన డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టి, ఈ ప్రాంత ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ వాకర్స్ అసోసియేషన్ రంగశాయిపేట అధ్యక్షుడు కొల్లూరి యోగానంద్ మాట్లాడుతూ, ఈ డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంతాల్లోని అనేక కాలనీల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పరశురాములు, గుండు బాబూరావు, బత్తిని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల ధర్మ పోరాట దీక్షల సందర్భంగా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందించిన -జాతీయ బి.సి సంక్షేమ సంఘం నాయకులు



నిత్యం నిఘా, ఖమ్మం, సెప్టెంబర్ 11 : దేశ వ్యాప్తంగా జరిగే జాతి జనగణలో బీసీ కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 1-5- 2025 న నిర్ణయం తీసుకొని ప్రకటించింది.కానీ ఇప్పుడు కుల గణన శాస్త్రీయమైన పద్ధతిలో చేయకుండా, ఓబీసీ కుటుంబాలను లెక్కించకుండా, బీసీ కాలం లేకుండా, ప్రతి కులానికి ఒక యూనిక్ కోడ్ లేకుండా బిసీలకు అన్యాయం చేస్తుంది, రెండవసారి అప్పుడే జాతీయ జన గణన ఆగస్టు 17వ తేదీ నుండి ప్రారంభం మొదలుపెట్టిందిబీసీలను మోసం చేసే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని, నయవంచను వ్యతిరేకిస్తూ ఈనెల 11 వ తేదీన (శుక్రవారం) రోజున తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, కేంద్రాల్లోబీసీల ధర్మ పోరాట దీక్షలు చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో అదనపు కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కేవీ కృష్ణారావు, జిల్లా అధ్యక్షులు బత్తిని మధు గౌడ్, గౌరవ అధ్యక్షులు బచ్చల పద్మాచారి, రాష్ట్ర కార్యదర్శి మోత్కూరి వెంకటేశ్వర చారి జిల్లా ఉపాధ్యక్షులు పార్థసారథి పుల్లూరు వెంకన్న బాబు,నాగరాజు యాదవ్ గుడిగంటి వీరన్న రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com